రేపటి నుంచి అగ్నివీర్ నియామక ర్యాలీ
● ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి: బళ్లారి కలెక్టర్

6

రెండో పంటకు నీరు ఇవ్వాలి
● లేదంటే రైతులకు ప్రత్యామ్నాయ పనులు చూపండి : ఏఐకేకేఎంఎస్

పేరు మార్చేద్దాం..!

● 29 విశ్వవిద్యాలయాలకు నూతన పేర్లు ● ప్రభుత్వం నిర్ణయం ● జిల్లాల పేర్లు తొలగింపు





హావేరి యూనివర్సిటీ

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలకు పేర్లు మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు జిల్లా, పట్టణం పేరుతోనే కొనసాగుతున్న యూనివర్సిటీలకు ప్రముఖుల పేర్లను పెట్టాలని భావిస్తున్నారు. ఇలా 29 యూనివర్సిటీల పేర్లను మార్పు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే 9 విశ్వవిద్యాలయాలకు ప్రముఖుల పేర్లు పెట్టారు. మిగిలిన యూనివర్సిటీలు సంబంధిత జిల్లాల పేర్లతోనే కొనసాగుతున్నాయి. తొలిదశలో నలుగురు ప్రముఖుల పేర్ల జాబితాను సిద్ధం చేశారు. ఈ పేర్లు ఏ యూనివర్సిటీలకు పెడ్తే బాగుంటుందనే కోణంలో రిజిస్ట్రార్ల అభిప్రాయాలను కోరారు. ఇందుకు సంబంధించి అన్ని యూనివర్సిటీలకు సర్క్యులర్‌లను పంపారు.

ప్రతి జిల్లాలో ఉండే యూనివర్సిటీ జిల్లా కేంద్రం పేరుతోనూ కొనసాగుతోంది. వాటిని మార్పు చేస్తే ఏ యూనివర్సిటీ ఎవరి పేరుకు సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలను ప్రభుత్వం కోరింది. అన్ని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్‌లు, రిజిస్ట్రార్‌లకు ప్రత్యేకమైన సూచనలు చేశారు. ప్రారంభంలో నలుగురు పేర్లను సిఫారసు చేసిన ప్రభుత్వం, వారి పేర్లను ఏ యూనివర్సిటీలకు సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు కోరారు. ఇందుకు ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి శశికళ పేరిట ఇప్పటికే సర్క్యులర్ జారీ అయ్యింది. బసవణ్ణ, కనకదాసు, నాల్వడి కృష్ణరాజ ఒడయార్, మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసుల పేర్లు ఏ విశ్వవిద్యాలయాలకు సముచితంగా ఉంటాయని సమగ్ర వివరాలతో నివేదిక పంపాలని కోరారు. దీంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీ, రిజిస్ట్రార్‌లతోపాటు పాలకవర్గం ముఖ్యులు కసరత్తు ప్రారంభించారు. ఈ నాలుగింటి పేర్లను ఖరారు చేసిన తర్వాత మిగిలిన యూనివర్సిటీల గురించి ఆలోచించాలని భావిస్తున్నారు. తొలివిడత నాలుగు యూనివర్సిటీల పేర్లను ఖరారు చేస్తే క్యాబినెట్‌లో ఆమోదించాలని భావిస్తున్నారు.


ఇప్పటికే రాయచూరు యూనివర్సిటీని మహర్షి వాల్మీకి పేరు పెట్టారు. విజయపుర యూనివర్సిటీకి శరణి అక్కమహాదేవి, బళ్ళారి యూనివర్సిటీకి శ్రీకృష్ణదేవరాయల పేరు, శివమొగ్గ యూనివర్సిటీకి కువెంపు పేరు, మైసూరులోని సంగీత యూనివర్సిటీకి డాక్టర్ గంగూబాయి హానగల్, బెళగావి కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు అనుబంధమైన యూనివర్సిటీకి విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ పేరు పెట్టారు. ఇక బెంగళూరు కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని మెడికల్ కళాశాలలకు అనుబంధమైన యూనివర్సిటీని రాజీవ్‌గాంధీ వైద్య పరిశోధనా విశ్వవిద్యాలయంగా మార్చారు. ఇటీవలే బెంగళూరు యూనివర్సిటీకి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరును, బెళగావి యూనివర్సిటీకి రాణి చన్నమ్మ పేర్లను ఖరారు చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వైస్‌చాన్స్‌లర్లతోపాటు రిజిస్ట్రార్లు వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎవరైనా విజేతల పేరిట యూనివర్సిటీలకు పేరు పెడితే జీవితకాలం ఉండే విశ్వవిద్యాలయాలలో సాధకుల పేర్లు, వారి చరిత్ర యువ విద్యార్థులు తెలుసుకునేందుకు వీలుంటుందని ప్రకటించారు.



● బెంగళూరు యూనివర్సిటీకి ఇటీవలే డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరును ఖరారు చేశారు. ఇలా మైసూరు, బెళగావి, బాగల్కోట ప్రతి జిల్లాపేరుతోనూ యూనివర్సిటీలు ఉన్నాయి. ప్రభుత్వం సూచించినందుకు అనుగుణంగా ఎవరి పేర్లు పెట్టాలనే విషయమై రిజిస్ట్రార్‌లకు టాస్క్ పెట్టినట్లయింది. మైసూరు, ధారవాడ, కలబురగి, మంగళూరు, హంపి, దావణగెరెతోపాటు మైసూరులోని ఓపెన్ యూనివర్సిటీలకు పేర్లకోసం వీసీలు కసరత్తు చేస్తున్నారు. కోలారులోని బెంగళూరు ఉత్తర యూనివర్సిటీ, హావేరిలోని జానపద యూనివర్సిటీ, మండ్య యూనివర్సిటీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, బెంగళూరు మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ, బెంగళూరు నృపతుంగ యూనివర్సిటీ, చామరాజనగర, హాసన్, బీదర్, హావేరి, బాగల్కోట, కొడగుతోపాటు 29 యూనివర్సిటీలకు పేర్లు ఖరారు చేసే విషయంలో వీసీలు కసరత్తు చేస్తున్నారు.

కొడగుకు మార్షల్ కరియప్ప పేరు..

కొడగు యూనివర్సిటీకి కావేరి లేదా ఫీల్డ్ మార్షల్ కారియప్ప, దొడ్డవీర రాజేంద్ర పేర్లలో ఏదైనా ఒకదానిని సిఫారసు చేయాలని ప్రభుత్వానికి కొడగు యూనివర్సిటీ వీసీ అశోక్ సంగప్ప సూచించారు. మైసూరు యూనివర్సిటీకి పేరు మారిస్తే పలువురి పేర్లు సంస్థలు, రాజకీయ నాయకులు, విద్యానిపుణులు భిన్నమైన వారిని నిర్దేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం నాల్వడి కృష్ణరాజ ఒడయార్, దేవరాజ్ అరసుల పేర్లు జాబితాలో ఉన్నాయి. వీరిద్దరి పేర్లలో మైసూరు యూనివర్సిటీకి ఏ పేరు పెట్టాలనేది సందిగ్ధంగా మారింది. ఇద్దరూ మైసూరు ప్రాంతానికి చెందినవారు కావడం విశేషం.



తుమకూరు యూనివర్సిటీ

రాజ్యాంగ వ్యతిరేక శక్తిగానే
వందేళ్లు..!

● ఆర్‌ఎస్‌ఎస్‌పై విరుచుకుపడ్డ ప్రియాంక ఖర్గే

● బీజేపీ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలన్న మంత్రి

● 75 ఏళ్ల రాజ్యాంగాన్ని... నూరేళ్లు ఎలా ఉల్లంఘించారు: బీజేపీ



బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్‌పై రాష్ట్ర ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే మరోసారి విరుచుకుపడ్డారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి గౌరవం ఇవ్వని, స్వాతంత్ర్య ఉద్యమంలో ద్రోహం, జాతిమొత్తం గౌరవించే రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడమే ఆ సంస్థ నైజమని, వందేళ్ల చరిత్ర సాధ్యమైందన్నారు. చరిత్రలో రికార్డులను పరిశీలించుకోవచ్చునని కొన్ని కాగితాలను విడుదల చేశారు. సోషల్‌మీడియాలోనూ ఆ లేఖలను పోస్ట్ చేశారు. 1948 ఫిబ్రవరి 24న అప్పటి హోం మంత్రిత్వశాఖ పంజాబ్ ముఖ్యకార్యదర్శికి రాసిన లేఖను పంచుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకాన్ని ఏ విధంగా అవమానించిందనే స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నాయన్నారు. దేశానికి ఆర్‌ఎస్‌ఎస్ చేసిన ద్రోహం ఎక్కువన్నారు. బీజేపీ ఎంతగా ప్రయత్నించినా ఆర్‌ఎస్‌ఎస్ ఒక రాజ్యాంగ వ్యతిరేక సంఘం అనే చేదు వాస్తవాన్ని దాచడం సాధ్యం కాదన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికైనా ఆర్‌ఎస్‌ఎస్ వాస్తవ చరిత్రను తెలుసుకోవాలన్నారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో బహిరంగంగా సామూహిక నమాజ్ చేసిన విషయమై ప్రస్తావిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి ఆచరణలను నియంత్రించాలని రాష్ట్రప్రభుత్వం చట్టం తీసుకురాదలిస్తే అందుకు కోర్టు నుంచి స్టే తెచ్చింది ఎవరని ప్రశ్నించారు. కాగా ఢిల్లీలో బాంబు పేలుళ్ల కేంద్ర హోం మంత్రి విఫలం కాదా..? వెంటనే అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరో ప్రశ్నకు బదులిస్తూ బెంగళూరు పరప్పన జైలులో విలాసాలపై హోం మంత్రి సమీక్ష చేస్తున్నారని దాటవేశారు.

● అయితే మంత్రి ప్రియాంకఖర్గే మన రాజ్యాంగం, మన జాతీయ పతాకానికి వందేళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ అవమానిస్తోందని విమర్శించారు. వాస్తవానికి 1950 జనవరి 26న రాజ్యాంగం ఆచరణలోకి వచ్చింది. ప్రస్తుతం రాజ్యాంగం ఏర్పడి 75ఏళ్లు మాత్రమే అయ్యింది. ప్రియాంకఖర్గే ఏకంగా వందేళ్లు అంటూ రాయడంతో నెటిజన్‌లు, బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు.

కేఎస్‌సీఏ ఎన్నికల కోసం కసరత్తు



సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్ ప్రసాద్, అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్ తదితరులు

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) కమిటీ ఎన్నికల కోసం కసరత్తు ప్రారంభమైంది. అర్జున అవార్డు గ్రహీత వెంకటేశ్ ప్రసాద్, శాంతకుమార్ అధ్యక్ష పదవికోసం తలపడుతున్నారు. ఇటీవల కొంతకాలంగా కేఎస్‌సీఏ ప్రగతి విషయంలో వెనుకబడిందనే విమర్శలు ఉన్నాయి. ఈ మేరకు కొత్త కమిటీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కేఎస్‌సీఏ ద్వారా మరింతమంది క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు అవసరమని తీర్మానించారు. ఈమేరకు వెంకటేశ్ ప్రసాద్ టీమ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. ప్రముఖ క్రికెటర్ అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్ పాల్గొన్నారు. కేఎస్‌సీఏకు పూర్వవైభవం కోసం కలసి పనిచేద్దామని తీర్మానించారు. కాగా ప్రత్యర్థి శాంతకుమార్‌కు బ్రిజేశ్ పటేల్ మద్దతు ఇస్తున్నారు. బోర్డు ఎన్నికలతో ఆటగాళ్లలో సందడి నెలకొంది.

ఏరోస్పేస్ నిపుణుల పుట్టినిల్లు బెంగళూరు: సీఎం



కొలిన్స్ ఇండియా ఆపరేషన్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం, డీసీఎం, కంపెనీ ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నగరిగానే కాకుండా ఏరోస్పేస్ నిపుణుల పుట్టినిల్లుగాను బెంగళూరు నిలిచిందని సీఎం సిద్దరామయ్య అన్నారు. దేవనహళ్ళిలోని కేఐఏడీబీ ఏరోస్పేస్ పార్క్‌లో కొలిన్స్ ఇండియా ఆపరేషన్స్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంకఖర్గే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఏటా 1.50 లక్షలమంది ఇంజనీర్లు కోర్సులు పూర్తి చేస్తున్నారన్నారు. కొలిన్స్ ఏరోస్పేస్ కంపెనీ ద్వారా స్థానికులకు ఉద్యోగం సాధ్యం కానుందన్నారు. కొలిన్స్ ఇండియా సంస్థ ద్వారా 2వేల ఉద్యోగాలు సాధ్యం కానున్నాయన్నారు. 45వేల కోట్ల పెట్టుబడులతో ఏరోస్పేస్‌రంగం ద్వారా 2027 నాటికి 60వేల ఉద్యోగాలు లభిస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు.

విమానాశ్రయంలో 'కళా లోక' స్టాల్‌కు శ్రీకారం

విమానాశ్రయంలో దేశ విదేశీయులను ఆకట్టుకునేలాంటి కర్ణాటక పరంపరగా ఉండే ప్రత్యేక బొమ్మల కేంద్రం 'కళాలోక'ను సీఎం ప్రారంభించారు. రెండో టర్మినల్‌లో పరిశ్రమలశాఖ ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన కళాలోకను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర భూపటంలో ఇదో సంతోషకరమైన విషయమన్నారు. విమానాశ్రయాల్లో దేశంలోనే అతిపెద్ద మూడోదిగా నిలిచిందన్నారు. రోజూ వేలాదిమంది ప్రయాణీకులు వస్తారని, కర్ణాటక పట్ల అభిమానం కల్గినవారు కళాఖండాలను కొనుగోలు చేసి ఆదరించాలన్నారు. ఇక్కడి బొమ్మలకు జీఐ గుర్తింపు ఉందన్నారు. మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ కళాలోక స్టాల్‌లో మైసూరు శాండల్ సోప్, అగరబత్తీ, మైసూరు సిల్క్, చన్నపట్టణ బొమ్మలు, లిడ్కర్ ఉత్పత్తులు, కాఫీ పొడి, చేతిమగ్గాలతో తయారైన ఇలకల్ చీరలు, లంబాణీల ప్రత్యేక దుస్తులు, గంధం కొయ్యతో కళాఖండాలు, వెదురు బొమ్మలు, మైసూరు శైలి కళాఖండాలు ఒకే చోట లభిస్తాయన్నారు. కేఎస్‌డీఎల్, కాఫీబోర్డు తోపాటు పలు సంస్థల సహకారంతో ఏర్పాటైందన్నారు. డీసీఎం డీకే శివకుమార్, పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్, కమిషనర్ గుంజన్‌కృష్ణ, కేఎస్‌డీఎల్ చైర్మన్ నాడగౌడ పాల్గొన్నారు.



చిత్రం గీస్తున్న సీఎం సిద్దరామయ్య

పటిష్ట భద్రత మధ్య
మాలూరు ఓట్ల లెక్కింపు

● ఫలితాలు సీల్డ్ కవరులో కోర్టుకు అందజేసిన అధికారులు



కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్, ఎస్పీ తదితరులు

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా మాలూరు శాసనసభ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు అత్యంత భద్రత మధ్యన నిర్వహించారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను మంగళవారం జరిపారు. రెండురోజులక్రితం మాలూరులో భద్రపరిచిన ఈవీఎంలను కోలారుకు తరలించారు. మంగళవారం ఉదయం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్‌కేంద్రంలోకి అనుమతించారు. కౌంటింగ్ హాల్ వద్దకు మీడియాను అనుమతించలేదు. కోలారు శివారులోని ఉద్యాన విశ్వవిద్యాలయం క్యాంపస్ చుట్టూ భద్రతాచర్యలు చేపట్టారు. 144వ సెక్షన్ అమలు చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. సాయంత్రం అయ్యే సరికి లెక్కింపు ముగిసింది. ఫలితాలు ప్రకటించరాదని సీల్డ్‌కవరులో కోర్టుకు సమర్పించాలనే ఆదేశాలు ఉండడంతో ఫలితాలను అధికారులు ప్రకటించలేదు. 2023 ఎన్నికల్లో మాలూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కేవై నంజేగౌడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థి కేఎస్ మంజునాథ్ ఓట్ల లెక్కింపులో మోసం జరిగిందని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు మరోసారి ఓట్ల లెక్కింపు చేపట్టాలని సూచిస్తూ కేవై నంజేగౌడ శాసనసభ్యత్వాన్ని రద్దు చేసింది. నంజేగౌడ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో అక్టోబరు 14న హైకోర్టు ఆదేశాలకు స్టే విధించింది. కానీ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అభ్యంతరం తెలపలేదు. దీంతో రీకౌంటింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసిన 15 మంది అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్‌కు కేఅనుమతిచ్చారు.



కౌంటింగ్ కేంద్రం బయట భద్రతా బలగాలు

అడుగడుగునా
నిఘా



● ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో హై అలర్ట్

● రైల్వే స్టేషన్లు, బస్టాండ్, ఎయిర్ పోర్టుల్లో ముమ్మర తనిఖీలు



మెజిస్టిక్ స్టేషన్‌లో లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో అడుగడుగునా నిఘా పెంచారు. ఢిల్లీలో కారు బాంబు నేపథ్యంలో గస్తీ ముమ్మరం చేశారు. ప్రమాదంతో దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారని, బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రయాణం చేయదలిచినవారు ముందుగా చేరుకోవాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు ప్రకటించారు. విమానాశ్రయంలో లగేజీతోపాటు ప్రయాణీకులను సమగ్రంగా తనిఖీ చేయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కారణాలతో జాప్యం జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. భద్రతా సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు తెలిపారు. సురక్షిత ప్రయాణం దృష్ట్యా కొన్ని కఠినమైన నిబంధనలు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా మెజస్టిక్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం సమగ్ర తనిఖీ జరిపారు. ప్రతి ప్రయాణీకుడికి సంబంధించిన లగేజి సమా అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు జరిపారు.



రైల్వే స్టేషన్లో..



బెంగళూరు విమానాశ్రయంలో గస్తీ బృందం

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో
డ్రోన్ సర్వే

● అనుమతి కోరిన ఏపీ ప్రభుత్వం


బళ్లారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో డ్రోన్ సర్వేకు ఏపీ ప్రభుత్వం అనుమతి కోరింది. బళ్లారి రిజర్వ్ ఫారెస్టు ఏరియాలో ఏపీలో లీజ్ పొందిన ఆరు మైనింగ్ కంపెనీలు తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేపడ్తామని ఏపీ ప్రభుత్వం తెలిపింది. బళ్లారి రిజర్వు ఫారెస్టులో రెండు రాష్ట్రాల సరిహద్దులు ఉన్నాయి. డ్రోన్‌ద్వారా సర్వే చేస్తున్న సమయంలో ఆకాశమార్గంలో కర్ణాటక ప్రాంతంలో కూడా డ్రోన్ సర్వే చేయాల్సి ఉంటుంది. దీనికి కర్ణాటక అనుమతి తప్పనిసరి. ఇంత వరకూ కర్ణాటక ప్రభుత్వం ఇంకా ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. వీటితో పాటు ఏపీ మైన్స్ అండ్ జియాలజీ అధికారులు కర్ణాటకలో ఉన్న గ్రానైట్ రకాలు, వీటికి ప్రభుత్వం పరంగా నిబంధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లీజ్ దారులు చెల్లిస్తున్న పన్నులు తదితర అంశాలపై వివరాలను కోరింది. కర్నాటక అధికారులు కూడా ఏపీలోని నిబంధనలు, అక్కడ రాష్ట్ర ప్రభుత్వం పొందుతున్న పనులపై ఆరా తీశారని భూగర్భ గనుల శాఖ జేడీ. తెలిపారు.

కర్మాగారాల బూడిదతో ఇబ్బందులు

కంప్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుడితిని వద్దనున్న కేపీసీఎల్ నుండి వెలువడిన బూడిదను నిత్యం కొన్ని వందల లారీల ద్వారా తరలిస్తారు. కానీ అందులో ట్యాంకర్ల ద్వారా నీరు తరలిస్తున్నారు. మంగళవారం ఉదయం కేపీసీఎల్ నుంచి యాష్ లోడుతో గంగావతి వైపుకు వెళుతున్న దేవలాపురం మారెమ్మ ఆలయం వద్ద లారీ ఆగిపోయింది. మరమ్మతుల కారణంగా ముందుకు కదల్లేదు. రిపేరీ చేయడానికి మెకానిక్‌లు లారీ ఉన్న బూడిదను బయట పడేశారు. గాలికి బూడిద వాహనదారుల కళ్లలో పడడంపై స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఇకపై యాష్ తరలించేవారు ట్యాంకర్ల ద్వారా మళ్లించుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కేపీసీఎల్ అధికారులు హెచ్చరించారు.



రోడ్డుపై పడేసిన బూడిద



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.20	1631.78
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,758	6,806
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,449	10,064
నీటి నిల్వ (టీఎంసీలు)	77.14	101.91

డ్రైవర్ అరెస్ట్

హోసూరు(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట అటవీశాఖ గార్డ్ సురేశ్, అటవీ అధికారులు అందేవనపల్లి సాయిబాబా ఆలయం సమీపంలో గస్తీ తిరుగుతుండగా ఒక ట్రాక్టర్ రాగా తనిఖీలు చేశారు. ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఫారెస్ట్ గార్డు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా డెంకణీకోట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అటవీ అధికారులను బెదిరించిన వ్యక్తి డెంకణీకోట తాలూకా ములువపల్లికి చెందన జాన్ (25)గా గుర్తించారు. పోలీసులు అరెస్టు చేశారు.

మట్టి అక్రమ రవాణా - లారీ స్వాధీనం

హోసూరు తహ శీల్దార్ గుణశివ, అధికారులు సిప్‌కాట్‌లోని బేగేపల్లి వైపు గస్తీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఆగి ఉన్న టారస్ లారీని తనిఖీ చేసినప్పుడు అనుమతి లేకుండా 8 యూనిట్ల మట్టిని గుర్తించారు. అధికారి గుణశివ ఫిర్యాదు మేరకు సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

కెలమంగలం సమీపాన చెరువులో పడి ఉత్తరాది రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందాడు. జార్ఖండ్‌కు చెందిన శివరాం(24) కెలమంగలం సమీపంలోని అగొండపల్లిలో ఒక ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. అగ్గొండపల్లి చెరువులో పడినట్లు అందడంతో కెలమంగలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటికి తీసి శవపరీక్ష కోసం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిల్ బోల్తా ..కార్మికుడి మృతి

శూలగిరి సమీపంలో మోటార్ సైకిల్ బోల్తా పడి కార్మికుడు మృతి చెందాడు. మురుగేశ్(25) శూలగిరి సమీపంలోని కద్దూరు నివాసి. అతను దినసరి కూలీ. దొడ్డయ్యనగిరి కరుబెల్ల రోడ్డులో కురుబరపల్లి వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన మురుగేశ్‌ను స్థానికులు రక్షించి చికిత్సకోసం కోసం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స ఫలించక మురుగేశ్ అక్కడే మృతిచెందాడు. శూలగిరి పోలీసలు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రేపటి నుంచి అగ్నివీర్ నియామక ర్యాలీ

● రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రానున్న అభ్యర్థులు ● ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ నియామకాలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని 13వ తేదీ నుంచి 18వరకు బళ్లారిలోని జిల్లాస్టేడియంలో ర్యాలీ నిర్వహిస్తామని కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని కొత్త జిల్లా పరిపాలన భవనంలోని వీడియో హాల్లో అగ్నివీర్ సేన నియామక ర్యాలీపై జరిగిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశ సైన్యంలో చేరాలనుకునే వారికి ఎంతో సువర్ణ అవకాశమని, ఇది జిల్లాలో చేపట్టడం హర్షణీయమని ఆయన అన్నారు. అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టి ఏవిధంగానూ ఆటంకాలు లేకుండా చూసుకోవాలన్నారు. అర్హత పరీక్షల్లో అర్హత సాధించిన అగ్నిమాపక సిబ్బంది నవంబరు 13నుండి 18వరకు జరిగే ర్యాలీకి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వస్తారని, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. ర్యాలీ వేదికకు చేరుకోవడానికి స్థలం గురించి సమాచారాన్ని సిటీ బస్టాండ్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసే హెల్ప్ లైన్ కేంద్రాల ద్వారా అందించాలి. అవసరమైతే వారిని కేటాయించిన బస్సుల ద్వారా తీసుకురావాలన్నారు. ఎటువంటి సమస్య లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

● ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో ఇప్పటికే అర్హత సాధించిన అడ్మిట్ కార్డును చూపితేనే జిల్లాస్టేడియంలోకి ప్రవేశించడానికి అనుమతి ఇవ్వాలన్నారు. అనధికార వ్యక్తులను అనుమతించరాదని, చుట్టప్రక్కల జిల్లాల నుంచి ద్విచక్ర వాహనాలపై వచ్చే అభ్యర్థులు తమ వాహనాలను నిర్దేశించిన స్థలంలో పార్క్ చేయాలని సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలి. జిల్లాస్టేడియం చుట్టూ గట్టి పోలీసు భద్రత కల్పించాలి. జిల్లాపోలీస్ సూపరింటెండెంట్లను ఆయన ఆదేశించారు.

ర్యాలీ ప్రతి రోజూ ఉదయం 5గంటలకు ప్రారంభమవుతుందని, శారీరక పరీక్ష వైద్య పరీక్షతో సహా ప్రక్రియ సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతుందని బెంగళూరు ప్రధాన కార్యాలయానికి చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి మేజర్ కపిల్ తెలిపారు. సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శోభారాణి అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, మున్సిపల్ కార్పోరేషన్ మంజునాథ్, డీఎంఎఫ్ ప్రత్యేక అధికారి లోకేశ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, వివిధ జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా దత్తత స్వీకరించరాదు

● నేరం రుజువైతే శిక్ష తప్పదు ● అవగాహనా కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పిల్లలను దత్తత తీసుకోవడంలో అక్రమాలకు పాల్పడడం సరికాదని, చట్టపరిధిని దాటరాదని, నేరం రుజువైతే కనీసం 5సంవత్సరాల జైలు శిక్ష , రూ. లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. అంతర్జాతీయ దత్తత మాస ప్రచారం కింద జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల ప్రాధికార సంస్థ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం నగరంలోని అబ్దుల్ కలామ్ అజాద్ రెసిడెన్షియల్ స్కూల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ జీవితం చాలా విలువైనదని, తల్లిదండ్రులు ఏకారణం చేతనైనా నవజాత శిశువులను విడిచిపెట్టినట్లు తేలితే దానిని జిల్లా బాలల రక్షణ శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి పిల్లలను రక్షించడం , జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా మంచి కుటుంబాలకు , తల్లిదండ్రులు ఏకారణం చేతనైనా నవజాత శిశువులను వారికి మంచి జీవితాన్ని ఇవ్వవచ్చని, దీనికి అందరూ సహకరించాలని సూచించారు.

జిల్లాబాలల రక్షణ అధికారిణి సుభద్రా దేవి మాట్లాడుతూ పిల్లల రక్షణ పోషణ మనందరి బాధ్యత బాల్యవివాహం , బాల కార్మికులు, బిక్షాటన, లైంగిక వేధింపులు, ఇతరసమస్యల నుంచి పిల్లలను రక్షించడం అందరి కర్తవ్యమన్నారు. ఎవరైనా అలాంటి సమస్యలను ఎదుర్కొంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112కు కాల్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అన్ని పాఠశాలల్లో పిల్లల భద్రతపై పిల్లలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను నిర్వహించాలని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో చిల్డ్రన్ స్పెషల్ పోలీస్ యూనిట్ సిబ్బంది లలితమ్మ, ప్రిన్సిపాల్ నాగయ్య హిరేమఠ్, లీగల్ ఇన్‌స్పెక్టర్ రావు, ఆనంద్, దత్తత ఏజెన్సీ సిబ్బంది గణేశ్, ఉపాధ్యాయులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది , పిల్లలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

హోసూరు జోన్

సరిహద్దులో ముమ్మర తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో సోదాలు నిర్వహిస్తున్నపోలీసులు



ఆర్టీసీ బస్సులో..

హోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన కారు బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులలో గస్తీ, తనిఖీలు ముమ్మరం చేశారు. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదశాలతో హోసూరు సమీపంలోని కర్ణాటక-తమిళనాడు సరిహద్దున జూజూవాడి ప్రాంతంలోని తమిళనాడు చెక్‌పోస్టు వద్ద ఏఎస్పీ నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. సిప్‌కాట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ముబారక్ పర్యవేక్షణలో ఎస్ఐ నేడుంచెళియన్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రతి వాహనాన్ని సోదాలు చేస్తున్నారు. కాగా బస్టాండ్ ప్రాంతాలలోనూ అనుమానాస్పద లగేజీలు, వ్యక్తులను తనిఖీలు చేశారు. కాగా కర్ణాటక నుంచి తమిళనాడు వైపు వచ్చే అన్ని వాహనాలను ఆపి సోదాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఓమ్ని బస్సులు, ఆర్టీసీ బస్సులు మొదలైన వాటిని తనిఖీ చేసిన తర్వాతనే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. అదే విధంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన కగ్గనూరు, సంపంగిరి, బేరికై, గుమ్మళాపురం, తళి, జవలగిరి, అంచెట్టి, తగ్గటి తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ముందు జాగ్రత్త చర్యగా కుర్లా ఎక్స్‌ప్రెస్ రైలును హోసూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేశారు. తనిఖీ చేయడానికి కృష్ణగిరి జిల్లా పిడీటీఎస్ బృందంతోపాటు డాగ్ స్క్వాడ్‌లో స్నిఫర్ డాగ్ రోసీని తీసుకొచ్చారు.

నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



ఉద్యాన కళాశాలలో కలెక్టర్ దినేశ్ కుమార్ తదితరులు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం పంచాయతీ యూనియన్, పయ్యూర్‌లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాల, పరిశోధన సంస్థ ప్రాంగణంలో కొత్త భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. తమిళనాడు ముఖ్యమంత్రి 2022 ఏప్రిల్‌లో కృష్ణగిరి జిల్లా పయ్యూర్‌లో ఉద్యానవన కళాశాల పరిశోధన సంస్థను ప్రారంభించారు. కళాశాలకు శాశ్వత భవనం నిర్మాణం కోసం రూ.70.18 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ కళాశాల విద్యార్థుల ప్రయోజనం కోసం నాబార్డ్ నిధులు కేటాయించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 101 మంది విద్యార్థులు చదువుతున్నారు, నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని శాఖ ఇంజనీర్లను ఆదేశించినట్లు కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందిరా, ప్రభుత్వ ఉద్యానవన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.అనిసారాణి, శోభన కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అధ్యక్షుడిపై అనర్హత వేటు

రాయచూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : నిబంధనల ఉల్లంఘన అవినీతి వ్యవహారానికి సంబంధించి జిల్లాలోని మస్కి తాలూకా తలేఖాన్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఉమ్మవ్వను పదవి నుంచి తప్పించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మహాత్మగాంధి గ్రామీణ ఉపాధిహామి పథకం బిల్లుల చెల్లింపు విషయంలో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆమె పై ఆరోపణలు వచ్చాయి. వాటితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులను సహితం దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఆరోపణలు రుజు కావడంతో ఆమెను పదవి నుంచి తప్పించి పంచాయతీ సభ్యత్వాన్ని రద్దు చేశారు.

ధైర్యసాహసాలకు మారుపేరు ఒణికె ఓబవ్వ

● జిల్లా హామీ పథకాల అథారిటీ చైర్మన్ చిదానందప్ప ● ఘనంగా జయంత్యుత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిదానందప్ప

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వీర మహిళ ఒణికె ఓబవ్వ అంకితభావం, ధైర్యం, సాహసం దేశ మహిళలకు ఆదర్శప్రాయమని, జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప అన్నారు. మంగళవారం నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు కల్చరల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన వీర వనిత ఒణికె ఓబవ్వ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హైదర్ ఆలీ సైనికులు చిత్రదుర్గకోటను ముట్టడించినప్పుడు తన ఇంట్లో ఉన్న ఒనకే(రోకలి) ఆయుధంగా ఉపయోగించుకుని వందలాది మంది శత్రు సైనికులను చంపిన వీర వనిత అని కొనియాడారు. దీనికే ఆమెకు ఓనకే ఓబవ్వ అనే బిరుదు వచ్చిందన్నారు. ప్రతి ఒక్క మహిళ ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈసందర్భగా చలవాది మహాసభ జిల్లా యూనిట్ అధ్యక్షుడు శివకుమార్, సాహితీవేత్త వెంకమ్మ, చోనసూరు కొట్రప్ప, బౌద్ధ మత మహాసభ బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు కలత్న బంటేజీ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సోమనాథ్, దళిత రక్షణ వేదిక కార్యదర్శి శంకర్ నందిహాల్, జర్నలిస్ట్ మంజునాథ్, సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజ్, ఇతర సంఘ నాయకులు ,పాల్గొన్నారు.

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి) : ఒణికె ఓబవ్వ వీరపరాక్రమవంతురాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పరిపాలన, నగరసభ, సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒణికేఓబవ్వ జయంతి వేడుకలు జరిగాయి. హైస్కూలు గ్రౌండ్ నుంచి నేతాజీ వ్యాయామశాఖ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేతాజీ వ్యాయామశాల ఆవరణంలో వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల ఆదర్శ తత్వసిద్దాంతాలను పాటించాలన్నారు. ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి బాటలో నడవాలని ఆయన కోరారు. ఒణికే ఓబవ్వ హైదరాలి సంస్థానంలో తన పరాక్రమ ప్రతిభను ప్రదర్శించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియాబేగమ్, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీఎం సతీష్, కొడ్లి మల్లికార్జున, బీజేపీ నాయకులు దరప్ప నాయక, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, చలవాది సమాజ నాయకులు గణేష్ పాల్గొన్నారు.



రాయచూరులో ఒణికె ఓబవ్వ జయంతిలో అధికారులు, నాయకులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శోభ

నాటక రంగంపై జానపద ప్రభావం అధికం

● మహారాణి క్లస్టర్ వీవీ సంస్కృత ప్రొఫెసర్ ఆర్ శోభ

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతీయ నాటక రంగంపై జానపద సంస్కృతి ప్రభావం అధికంగా ఉందని, జానపద రచయితలు తమ ఆనందాలు, దుఃఖాలు , ఆందోళనలను ప్రదర్శన ద్వారా వ్యక్తీకరించడం ప్రారంభించారని మహారాణి క్లస్టర్ విశ్వవిద్యాలయం సంస్కృత ప్రొఫెసర్ ఆర్. శోభ అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ (స్వయం ప్రతిపత్తి) కళాశాల ఆడిటోరియంలో సాంస్కృతిక కమిటీ , కన్నడ నాటక విభాగాలు నిర్వహించిన 'భారతీయ నాటక రంగం యొక్క మార్గం' అనే ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు. సహజ ప్రదర్శన ద్వారా సామాన్య ప్రజల సాంస్కృతిక జీవితం బయటపడిందన్నారు. జానపద రచయితలు రామాయణం, మహాభారతంలోని సంఘటనలను దృశ్యమానంగా ఆకర్షణీయంగా ప్రదర్శించారు. దీని ద్వారా వారు జానపద దేవుళ్ళు, నమ్మకాలు, ఆచారాలను ప్రేక్షకులకు తెలియజేశారని విశ్లేషించారు. భరత నాట్య శాస్త్రం అనేది నాటక రంగం యొక్క తత్వాన్ని ప్రత్యేకంగా నమోదు చేసే అరుదైన రచన. మనం దానిని ఆవిధంగా పరిశీలిస్తే దీనికి ముందు కూడా నటన యొక్క వినోదాత్మక ఆలోచనలు తెలసుకోవచ్చన్నారు. పూర్తిగా మతం ఆధారంగానే పుట్టాయని కాళిదాసు, భవభూతి, విశాఖదత్త, అశ్వఘోష ఇతరులు అనేక మంది నాటక రచయితలు ప్రారంభంలో నాటక రంగం అభివృద్ధికి దోహదపడ్డారన్నారు.

కళాశాల నాటక విభాగాధిపతి డాక్టర్ దస్తగిరిసాబ్ దిన్ని మాట్లాడుతూ థియేటర్ అనేది మానవ నాడి ని సూక్ష్మంగా వ్యక్తీకరించే శక్తివంతమైన మాధ్యమం. ఇది ప్రధానంగా ఒక వ్యక్తి తన ఉనికి పాల్ ప్రహ్లాద్ చౌదరి మాట్లాడుతూ పాటలు, నృత్యాలు, సంభాషణల ద్వారా ఉత్కంఠభరితమైన అనుభవాన్ని అందించే నాటక మాధ్యమం నేటికీ సూది దారంలా మనల్ని ఆకర్షిస్తుందన్నారు. ఈసందర్భంగా నాటక విభాగం సాంస్కృతిక కమిటీ కో-ఆర్డినేటర్ జ్యోతి అన్నారావు, అతిథి అధ్యాపకులు విష్ణుహడపాడు, నేతి రఘుఉరాం, సహాయక ఆచార్యులు రామస్వామి, లింగప్ప , ప్రవీణకుమార్ తదితరులున్నారు.

అక్కమహాదేవి ఆలయానికి రూ.2 లక్షలు

మరమ్మతులకు వినియోగించాలన్న జిల్లా అధికారి



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జిల్లా అధికారి

కంప్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అక్కమహాదేవి మహిళా మండలి శ్రీ క్షేత్ర ధర్మస్థలానికి ఆలయ పునరుద్దరణ కోసం క్షేత్రం నుంచి అనుభవ మండపానికి రూ. రెండు లక్షలు మంజూరు చేశారు. మంగళవారం బళ్లారి జిల్లా డైరెక్టర్ రోహితాక్ష, అక్క మహాదేవి అనుభవ మండపాన్ని సందర్శించి, కమిటీ సభ్యులందరి సమక్షంలో రూ. రెండు లక్షల డీడీని అందజేశారు. తరువాత ఆయన మాట్లాడుతూ క్షేత్ర ధర్మస్థలం మతపరమైన భక్తి భక్తికి అందించే సహకారం ప్రత్యేకమైనదని రాష్ట్రవ్యాప్తంగా మతపరమైన భక్తి, భక్తి, ఆధ్యాత్మికతను పెంచడానికి కర్ణాటక పురాతన దేవాలయాల పునరుద్దరణకు సహాయ హస్తం అందిస్తోంది. ఇప్పటివరకు కంప్లి తాలుకాలో దాదాపు 25 నుండి 30 దేవాలయాల అభివృద్ధికి ఇది కృషి చేసింది. శ్రీ క్షేత్ర ధర్మస్థలం చాలా పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించడంలో ప్రత్యేకతను కలిగి వుంది. మన కర్ణాటక రాష్ట్రంలోని మిగిలిన అన్ని మత కేంద్రాలలో అమలు చేయడానికి ఒక ప్రణాళికను రూపొందించింది. అదనంగా సంవత్సరానికి రెండు సార్లు తాలుకాలోని కేంద్రాలలో శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దేవాలయాలలో చెత్త పారవేయడానికి ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కంప్లి తాలుకా ప్లానింగ్ అధికారులు, శ్రీ రాఘవేంద్ర, డాక్టర్ జగన్నాథ్, అక్కమహాదేవి మహిళా మండలి సభ్యులు, వ్యవసాయాధికారి సంజుకుమార్, జోస్ సూపర్‌వైజర్ మంజన్న, జోన్‌లోని అన్ని సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీ ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలి

వాల్మీకి సంఘం డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసనలో సంఘం సభ్యులు, విద్యార్థులు

బళ్లారిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీ విద్యార్థులకు ప్రోత్సాహక ధనం విడుదల చేయాలని నిరసన చేపట్టారు. మంగళవారం నగరంలో ఉదయం అఖండ కర్ణాటక వాల్మీకి కుల బాంధవుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో సీఎం సిద్దరామయ్యకు, మంత్రికి రాసిన వినతిపత్రం అందజేశారు. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు చెందిన స్కాలర్‌షిప్ విడుదల రాలేదని, విద్యార్థులు కళాశాల ఫీజు చెల్లించడానికి తల్లిదండ్రులకు వార్షిత కాలర్ సభ్యులు వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. లేకపోతే చదువుకు అడ్డంకి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖండ కర్ణాటక వాల్మీకి రాష్ట్ర ఉపాధ్యక్షు డు జనార్దన్ నాయక్, జిల్లా అధ్యక్షులు ఎర్రగుడి, ముద్దమల్లయ్య, అడ్వకేట్ జయరాం, రూపనగుడి గోవిందప్ప, వెంకటేష్, మారెన్న, హనుమంతప్ప, పుష్ప, చంద్రశేఖర్, పలువురు వాల్మీకి కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు నీరు ఇవ్వాలి: ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రాంత రైతులకు రెండవ పంటకు నీరు అందించాలని లేదా ప్రత్యామ్నాయ పనులు చూపాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాకలెక్టర్ ద్వారా నీటిపారుదల మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకార్యదర్శి గురళ్ళిరాజ మాట్లాడుతూ బళ్లారి, విజయనగరం, కొప్పళ , రాయచూర్ జిల్లాల రైతులు తాము పండించే రెండవ పంటపైన అధికంగా ఆధారపడి ఉన్నామన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇప్పుడు పంటను కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం దీనిపై ముందుగానే దృష్టి సారించి ఉండాలన్నారు. వారు మొదటి పంట కంటే తక్కువ ఖర్చుతో రెండవ పంట నుండి ఎక్కువ ఆదాయాన్ని పొందగలిగేవారు. అందువల్ల ఈనాలుగు జిల్లాల రైతులకు ఎల్ఎల్‌సీ కాలువకు రెండవ పంటకు నీటిని మళ్ళించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికే తన నిర్ణయాధికారాన్ని కొనసాగిస్తోంది. ఈ నెల 5వతేదిన జరగాల్సిన రిజర్వాయర్ సలహా కమిటీ సమావేశం ఎటువంటి కారణం లేకుండా 14వ తేదికి వాయిదా పడింది.దీనివల్ల రైతులు గందరగోళంలో పడ్డారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే జనవరి 10నాటికి హెచ్ఎల్‌సీ కాలువకు నీరు విడుదల చేస్తే ఈ ప్రాంత రైతులు తాము పండించిన పంటలను పండించుకోగలుగుతారు. అందువల్ల వారికి నీరు అందించాలి. నిపుణుల సలహా మేరకు ఇబ్బందుల్లో ఉన్న రిజర్వాయర్ గేట్లను నిర్మించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. నీటిని విడుదల చేయలేకపోతే రైతులకు ప్రత్యామ్నాయ పనులు అందించాలని రైతు రుణాలు మాఫీ చేయాలన్నారు. ఉన్న వరి పంటకు రూ. 3500 ఇవ్వాలని ,ఇతర పంటలకు మంచి ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. క ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్, జిల్లా కమిటీ సభ్యులు వన్నూరప్ప, మారెప్ప, బసవ రాజ్, రుద్రయ్యకాసీం సాబ్ తదితరులున్నారు.




కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఏఐకేకేఎంఎస్ సభ్యులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కొప్పరపు వేంకట సుబ్బరాయకవి (జయంతి)




తెలుగు సాహిత్య అవధానంలో పేరొందిన జంట సోదర కవులు కొప్పరపు సోదరులు. వీరిలో పెద్దవాడు కొప్పరపు వేంకట సుబ్బరాయ కవి 1885 నవంబరు 12న గుంటూరు జిల్లా అద్దంకి తాలూకా కొప్పరం గ్రామం (ప్రస్తుతం ప్రకాశం జిల్లా)లో జన్మించారు. 16ఏళ్లు నిండకనే సోదరులు ఆశుకవిత్వాన్ని ప్రదర్శించి పేరొందారు. 1908 నుంచి అసంఖ్యాక అష్టావధానాలు, శతావధానాలు చేసి 'కవిత పుట్టిల్లు సోదరకవుల ఇల్లు' అనే ఖ్యాతి పొందారు. ప్రబంధ శైలిలో గంటకు 500 పద్యాలు చెప్పేవారు. మార్టేరు సభలో పందెం వేసి గంటకు 720 పద్యాల లెక్కన అరగంటలో మనుచరిత్రను ఆశువుగా చెప్పినట్టు తెలుస్తోంది. ఆశుకవీంద్ర సింహ, ఆశుకవి చక్రవర్తి, కవిరత్న, కథాశుకవీశ్వర, ఆశుకవి శిఖామణి తదితర బిరుదులు ఉన్నాయి. 1932 మార్చి 29న కన్నుమూశారు.

మదన్ మోహన్ మాలవీయ (వర్ధంతి)



'సత్యమేవ జయతే' నినాదాన్ని వ్యాపింప చేసిన ప్రముఖ విద్యావేత్త, కర్మయోగిగా పేరొందిన పండిట్ మదన్ మోహన్ మాలవీయ (మాలవ్యా) 1861 డిసెంబరు 25న అలహాబాద్‌లో జన్మించారు. అఖిల భారతీయ హిందూ మహాసభ సంస్థాపకుడు. వారణాసిలో 'బెనారస్ హిందూ యూనివర్శిటీ' వ్యవస్థాపకులు. విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్స్‌లర్‌గా సుదీర్ఘకాలం వ్యవహరించారు. ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. భారత జాతీయ కాంగ్రెస్‌కు 4సార్లు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1946 నవంబరు 12న కన్నుమూశారు. 2015లో మరణానంతర అత్యున్నత 'భారతరత్న' పురస్కారం ప్రకటించారు.

అనంతకుమార్ (వర్ధంతి)



బెంగళూరు దక్షిణ నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగిన హెగ్గనహళ్ళి నారాయణశాస్త్రి అనంతకుమార్ 1959 జూలై 22న బెంగళూరులో జన్మించారు. ప్రత్యేకించి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా, రసాయన, ఎరువుల శాఖ మంత్రిగా గుర్తింపు పొందారు. బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను, వేప లేపనంతో యూరియా, పర్యావరణ స్నేహి ఎరువులను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనదే. సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద రాగిహళ్ళి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. 2018 నవంబరు 12న కన్నుమూశారు.

నాగప్పకు ప్రత్యేక పూజలు



అలంకరణలో ఏడు తలల నాగప్ప

కంప్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బుక్కసాగర గ్రామం అడవుల్లో వెలసిన ఏడు పడగల నాగప్ప ఆలయంలో కార్తీక మాసం మంగళ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి భక్తులు విశేసంగా తరలివచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం దీపాలు వెలిగించి మహిళలు భక్తిని చాటుకున్నారు.

ఉలిగమ్మ దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉలిగమ్మదేవి

బళ్లారిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా ఉలిగిలోని ఉలిగమ్మ దేవస్థానంలో కార్తీక మంగళవారం విశేష అలంకరణ నిర్వహించారు. ఇరు రాష్ట్రాల నుంచి భక్తాదులు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నదిలో పుష్కర స్నానం చేసి కార్తీక దీపాలు వెలిగించారు.

ఓబవ్వ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

» తహసీల్దార్ మనీషా ఎన్ పత్రి

బాగేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వీరవనిత ఒణికె ఓబవ్వ ఇంటి పనిచేస్తూ యుద్ధం గురించి అవగాహన లేకున్నా సమయస్ఫూర్తితో ధైర్యంతో పోరాటం చేసి కోటను రక్షించారని ఓబవ్వ ధైర్యసాహసాలు నేటితరానికి స్ఫూర్తిదాయకం కావాలని తహసీల్దార్ మనీషా ఎన్ పత్రి పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ సభాంగణంలో తాలూకా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో ఒణికె ఓబవ్వ జయంతి మంగళవారం జరిగింది. వీరవనిత ఒణికె ఓబవ్వ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. 18వ శతాబ్దంలో చిత్రదుర్గ కోట రక్షణకోసం ఒణికె ఓబవ్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన ఛలవాది సామాజికవర్గ విద్యార్థులను సన్మానించారు. బీఈఓ ఎన్ వెంకటేశప్ప, రాధమణి, శివప్ప, మంజునాథ్, పశువైద్యశాఖ కృష్ణమూర్తి, సాంఘిక సంక్షేమశాఖ మంజుళ తదితరులు పాల్గొన్నారు.



ఓబవ్వ, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి

2047 ఉన్నత లక్ష్యం కోసం కృషి

» కేంద్ర సైన్స్‌టెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ అభయ్ కరండికర్



ఐఈఈఈ ఫ్యూచర్ నెట్‌వర్క్స్ వరల్డ్ ఫోరం ప్రారంభం

మహదేవపుర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి దేశాన్ని స్వావలంబిగా ఉన్నత భవిష్యత్తు కోసం ప్రపంచానికి ప్రభావం చూపే దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ అభయ్ కరండికర్ పేర్కొన్నారు. ఐఈఈఈ ఫ్యూచర్ నెట్‌వర్క్స్ వరల్డ్ ఫోరం 2025 ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ పరిశోధనలు, ఆవిష్కరణలకు వేగం చేకూర్చేలా కేంద్రప్రభుత్వం ఒక ట్రిలియన్ ఆర్ అండ్ డీ ఇన్నోవేషన్ ఫండ్ ప్రకటించిందన్నారు. 6జీ, క్వాంటమ్, సెమీ కండక్టర్‌లు, స్పేస్, ఏఐ, ఆధారిత హెల్త్‌కేర్, క్లైమేట్ టెక్ వంటి రంగాలలో ప్రైవేట్‌సంస్థలను కూడా ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. భారత్ ప్రస్తుతం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పబ్లికేషన్స్‌లో ప్రపంచంలో మూడోస్థానంలో ఉందని, 1.7 లక్షల స్టార్టప్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ఉందని వందకంటే ఎక్కువ యూనికార్న్ సంస్థలు ఉన్నాయన్నారు. ఐఈఈఈ వరల్డ్‌ఫోరం సహాధ్యక్షుడు అశోతోష్ దత్తా, ఐపీవీ6 ఫోరం అధ్యక్షుడు డాక్టర్ లతీఫ్ లాడిద్, తేజస్ నెట్‌వర్క్స్‌కు చెందిన అనింద్య సాహా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'అర్ణవ'

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జయనగర్ నేషనల్ కళాశాలలో రెండురోజులపాటు సాగిన సాంస్కృతిక, సినర్జియా అర్ణవ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మంగళవారంతో ముగిసిన కార్యక్రమంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల సాంస్కృతిక ఉత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన పీయూ, డిగ్రీ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నటి సుమన్ నగర్కర్ బహుమతులు ప్రదానం చేసి మాట్లాడుతూ.. తాను ఇదే నేషనల్ కళాశాల బసవనగుడి విద్యార్థినని చెప్పుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ విద్యతోపాటు కళలు, సాహిత్య, సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆఫ్ కర్ణాటక గౌరవ కార్యదర్శి శి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. కళాశాల నాణ్యతకు న్యాక్ ఉత్తమ శ్రేణి ర్యాంక్ లభించిందన్నారు. కొత్త కోర్సులు ప్రారంభించామని విద్యార్థులు పోటీలలో కనీసంగా పాల్గొని విజేతలు కావాలన్నారు. తద్వారా జీవనంలో ప్రగతి సాధ్యమన్నారు. స్ట్రీట్ ప్లే, గ్రూప్ సింగింగ్, గ్రూప్ డ్యాన్స్, జానపద నృత్యం, మైమ్, నాటకం, సంప్రదాయ నడక, మోనో యాక్టింగ్, క్లాసికల్ సంగీతం, క్విజ్, మ్యాడ్ ఆడ్ షో, కొలాజ్ మేకింగ్, కన్నడ ఆన్‌లైన్ ప్రశ్నలు తదితర పోటీలు నిర్వహించారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

అమ్మతనానికి మించింది లేదు

» సిద్దగంగ మఠాధిపతి సిద్దలింగస్వామి



కార్యక్రమంలో సిద్దగంగ మఠాధిపతి సిద్దలింగస్వామీజీ తదితరులు

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమ్మదనానికి మించింది లేదని ప్రతి ఒక్కరూ తల్లిని గౌరవించాలని సిద్దగంగా మఠాధిపతి సిద్దలింగస్వామిజీ అభిప్రాయపడ్డారు. వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో ఏర్పాటైన అమ్మ 90 అనే ప్రత్యేక కార్యక్రమాన్ని స్వామిజీ ప్రారంభించారు. జీవనంలో తల్లిస్థానం గొప్పదని మనకు అన్ని ఇచ్చిన తల్లిని బతికి ఉన్నప్పుడే గౌరవించాలని సూచిం చారు. ప్రేమ కొరతతో అనాధ ప్రజ్ఞతో బతికేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. తల్లిని ప్రేమతో చూసుకోవడమే ఆదర్శమైనదన్నారు. శంకరాచార్య వంటి యోగి కూడి తల్లిని ప్రత్యేకంగా ప్రేమించినవారేనన్నారు. అమ్మ 90 పేరిట వచనజ్యోతి బళగ వ్యవస్థాపకుడు పినాకపాణి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. రాజ్యోత్సవ పురస్కార గ్రహీత దేవేంద్రకుమార్ పత్తార, కర్ణాటక రచయిత్రల సంఘం అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎల్ పుష్ప, శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీ సోమశేఖర్, వసుదేంద్రలు పాల్గొన్నారు. పినాకపాణి మాట్లాడుతూ అమ్మ 80 పేరిట ప్రత్యేక కార్యక్రమం జరిపామని ప్రస్తుతం అమ్మ 90 నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తల్లి పట్ల అభిమానం, ప్రేమతో కార్యక్రమం చేస్తున్నామని, ఇది అందరూ పాటిస్తే బాగుంటుందన్నారు. అత్యంత కష్టకాలంలో కాపాడిన తల్లి నిజమైన దేవత అన్నారు. కార్యక్రమంలో వచనజ్యోతి బళగ మహేశ్ బెళ్ళద, గురుప్రసాద్ హుచ్చంగి. ప్రభు ఇసువనహళ్ళి రాజా గురుప్రసాద్, మధుశివకుమార్, ఆర్‌జీ హళ్ళి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిధామలో లక్ష బిల్వార్చన

బొమ్మనహళ్ళి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని అరికెరె లే అవుట్‌లోని శాంతిధామలో కొలువైన మంజునాథస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయంలో అభిషేకం, పంచామృతాభిషేకం ఇతర ధార్మిక కైంకర్యాలు కొనసాగాయి. సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు 45మంది దంపతులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. సంతోష్ అనే వ్యక్తి పూజకు అవసరమైన బిల్వపత్రాలు సమకూర్చినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. ఆలయం తరపున ప్రత్యేకంగా సత్కరించారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు కార్తీక సోమవారం సందర్భంగా లక్ష దీపోత్సవం నిర్వహించినట్టు తెలిపారు. కాగా నాల్గో సోమవారం 17న ఆకాశదీపంతోపాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను, భక్తులను నిభాయించిన సేవాదళ్ సభ్యులను అభినందించారు. ఆలయ ట్రస్టు పదాధికారులు ముకేశ్‌కుమార్‌వర్మ, తాతయ్యగుప్త, మనోహర్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, సత్య నారాయణశెట్టి, వెంకటేశ్ గుప్త, సురేశ్‌శర్మ, లీలా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంజునాథస్వామి బిల్వార్చనలో పాల్గొన్న ప్రముఖులు

ముత్తానల్లూరులో లక్ష దీపోత్సవం

దొమ్మసంద్ర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా ముత్తానల్లూరు గ్రామంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని లక్ష దీపోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలోని ధర్మరాయస్వామి, శనైశ్చర స్వామి, వీరభద్రస్వామి, దండుమారియమ్మ, నందాల యల్లమ్మ, సపలమ్మ ఇతర గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా శనైశ్చర దేవస్థానం 26వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ పాలకమండలి అధ్యక్షుడు పిల్లారెడ్డి నేతృత్వంలో గ్రామంలో భరతనాట్యం, కోలాటం పోటీలతోపాటు అగ్నిగుండంపై నడక వంటివి కొనసాగాయి. దీపోత్సవంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీల విజేతలను సత్కరించారు. ముత్తానల్లూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగరత్న కాంతరాజు, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, జాతీయ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నప్ప వై చిక్కహాగడె, ప్రము ఖులు వెంకటస్వామిరెడ్డి, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రముఖులు



కళాకారుల బృందంతో నిర్వాహకులు తదితరులు

పశువైద్యశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రూ.50 లక్షల వ్యయంతో పశువైద్యశాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ భూమిపూజ చేశారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం నూతన పశువైద్యశాల నిర్మాణ పనులకు ఎంపీసీ నిధుల కింద రూ. 50 లక్షలు నిధులు విడుదల కావడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ బసవరాజుకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ సదాశివ, తాలుకా పశువైద్యశాల వైద్యాధికారి గంగాధర, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉచ్చీరప్ప, మేనేజర్ సురేంద్ర పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

రూరల్ సీఐతో కాంగ్రెస్ నేతల భేటీ



సీఐ ఉదయ్ రవిని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రామీణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉదయ రవి సోమవారం బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. మంగళవారం పలువురు ప్రముఖులు ఆయిన్ని కలిశారు. కాంగ్రెస్ నాయకులు హగరి గోవిందు వన్నప్ప, పాటిల్ కాంగ్రెస్ నాయకులు ఆయన్ని కలిసి సత్కరించారు.

బెంగళూరు నుంచి బోధన్‌కు బస్సు సర్వీసు

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ప్రతిరోజూ బోధన్‌కు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు టీఎస్‌ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రసాద్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు బోధన్‌లో బయల్దేరే బస్సు బాన్సువాడ, నర్సాపూర్, మెదక్, బాలానగర్‌ల మీదుగా హైదరాబాద్ జేబీఎస్ బస్టాండ్‌కు చేరుతుందన్నారు. బెంగళూరుకు ఉదయం 5.45 గంటలకు మెజస్టిక్ బస్టాండ్‌కు వస్తుందన్నారు. ప్రతిరోజూ బెంగళూరు నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరే బస్సు మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు బోధన్‌కు వెళ్తుందన్నారు.

సూది రహిత ఇంజెక్షన్

బెంగళూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మనిషి పుట్టినప్పటి నుంచి సూది ద్వారా వ్యాక్సిన్‌తోపాటు జబ్బు ఏదైనా ఇంజెక్షన్ రూపంలో తీసుకోవడం సామాన్యం. సున్నితంగా, సురక్షితంగా ఇంజెక్షన్ వేసినా కొందరు ఒత్తిడికి లోనవుతారు. సూది భయం అనేది నిరంతరంగా ఉండేది. రోగ నిర్ధారణ పరీక్షలు, ఇంజెక్షన్‌లతోపాటు ప్రముఖమైన చికిత్సలు చేయాలంటే తప్పనిసరిగా సూది వాడుతారు. సూదులంటే భయపడాల్సిన అవసరం లేకుండా ఎన్-ఎఫ్ఐఎస్ దేశంలో సూది రహిత ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిరంతర సవాళ్లలో ఒకటైన సూది భయం, సంప్రదాయ ఇంజెక్షన్లను, అస్వస్థతను నిభాయించి ఆరోగ్యరక్షణకోసం ఎన్-ఎఫ్ఐఎస్ పరికరం అందుబాటులోకి తెచ్చారు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ కల్గిన ఈ పరికరం సంప్రదాయ సిరంజిలకంటే భిన్నమైనది. ఈ సాధన ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు రావని ఇంటిగ్రి మెడికల్ సంస్థ ప్రకటనలో పేర్కొంది. దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించారు.

మధుమేహానికి హోమియోపతిలో ఉత్తమ చికిత్స

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మధుమేహం బాధితులు పెరిగిపోతున్నారని ప్రధానంగా పాదాలలో తలెత్తే సమస్యలు వారి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయని హోమియోపతిలో ఉత్తమ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ కుశాల్ బెనర్జీ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో క్లినిక్ అందుబాటులో ఉందన్నారు. 1977లో ప్రారంభించామని ప్రస్తుతం నెలకు 5వేలమందికిపైగా చికిత్సలు అందిస్తున్నామన్నారు. మధుమేహంతో నెఫ్రో, రెటినోపతి. నరాల సమస్యలు, గాంగ్రీన్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియోపతి ద్వారా ఉపశమనం సాధ్యమన్నారు. ఇన్సులిన్‌తో సాధ్యం కానివారు హోమియోపతివైపు వస్తున్నారన్నారు. కుశాల్ బెనర్జీ అభిప్రాయం ప్రకారం వ్యతిరేక పరిణామాలు చూపవన్నారు.

అలరించిన వైదేహి కచేరి



కచేరి నిర్వహిస్తున్న వైదేహి

బెంగళూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామా ఫౌండేషన్ నెలవారీ కచేరిలో భాగంగా యలహంకలో నిర్వహించిన వైదేహి సంగీత కచేరి అలరించింది. సామా ఫౌండేషన్ ప్రతినెలా సంగీత కార్యక్రమాలు పరంపర సాగిస్తున్నారు. విదూషి వైదేహి ప్రధాన గాయని కాగా వయోలిన్‌పై శ్రీవిద్య దావులూరి, మృదంగంపై బీజే శ్రీనివాసులు సహరాం అందించారు. వర్ధమాన, స్థిరపడిన కళాకారుల భాగస్వామ్యంతో ప్రతినెలా కచేరిలు నిర్వహిస్తున్నారు. బెంగళూరు ఉత్తర ప్రాంతంలో సంగీత కార్యక్రమాలు కొనసాగించడమే మా ఆశయమని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, కేఎల్ రావ్, స్మితా, రాధ కంతనశెట్టితోపాటు పలువురు పాల్గొన్నారు.

విశ్వవిద్యాపీఠంలో కార్తీక వనభోజనం

దొమ్మసంద్ర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్రలోని విశ్వవిద్యాపీఠం పాఠశాలలో వర్తూరు తెలుగుసంఘం ఆధ్వర్యంలో ఏకాదశి రుద్రాభిషేకం, కార్తీకమాస వనభోజన కార్యక్రమాలు కొనసాగాయి. ప్రత్యేక పూజల్లో 250మందికిపైగా సభ్యులు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీకృష్ణ, సంఘం కార్యవర్గ సభ్యులు భాగస్వామ్యులయ్యారు. కార్యక్రమం విజయవంతంనకు సహకరించినవారికి పాఠశాల పాలకమండలి సుశీలా ధన్యవాదాలు తెలిపారు.

చెట్టుకు కారు ఢీకొని వ్యక్తి మృతి



నాగేశ్ (ఫైల్)

శిడ్లఘట్ట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తాలూకా లోని బెళ్ళూటిగేట్ ప్రాంతం ఎస్ఎల్‌వీ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఒక కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. కారు డ్రైవర్ మళమాచనహళ్ళికి చెందిన నాగేశ్ (39) అక్కడికక్కడే మృతి చెందాడు. మళమాచనహళ్ళి నుంచి శిడ్లఘట్ట మార్గంలో కారులో వెళ్తుండగా సోమవారం ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా నాగేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.

25 నుంచి నీటి విడుదల

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు ఈనెల 25న నీటి విడుదల చేస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు తెలిపారు. పీఏబీఆర్ కుడికాలువకు నీటి విడుదల, గేట్ల రిపేరీ, పిచ్చి మొక్కల తొలగింపుపై మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఇంజనీర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఐఏబీలో తీర్మానించిన ప్రకారం ఈనెల 15న పీఏబీఆర్ కుడికాలువకు నీటి విడుదల చేయాల్సి ఉండగా, పలు కారణాలతో వాయిదా వేశామన్నారు. పీఏబీఆర్ గేట్ల రిపేరి కోసం పంపిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.29లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో గేట్ల రిపేరితో పాటు పీఏబీఆర్ నుంచి కుడి కాలవ 25కిలోమీటరు వరకు మొదటి విడతలో పిచ్చిమొక్కల (జంగిల్ క్లియరెన్స్) తొలగింపు పూర్తి చేస్తామన్నారు. తరువాత నీటి విడుదల చేస్తామన్నారు.